క్లుప్తంగా

కొండపోచమ్మ సన్నిధిలో భక్తుల సందడి


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని కొండ పోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నం కొండపోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

వ్యాపార రంగంలో రాణించాలి

భువనగిరి ఎంపీ చామల


హోటల్ ప్రారంభిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): యువత వ్యాపారరంగంలో రాణించి ఆర్థికంగా ఎదగాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణ కేంద్రంలో నూతనంగా నెలకొల్పిన 'ఫైవ్ ఫ్లవర్స్' హోటల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో హోటల్ నిర్వాహకులు నూకల స్వాగత్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా శివకుమార్


శివకుమార్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

గజ్వేల్: రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పట్టణానికి చెందిన కె.శివకుమార్ నియామకమయ్యారు. ఆదివారం హైదరాబాద్ బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీలో ఈ ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా శివకుమార్‌ను సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికచేశారు.

విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి


గేదె కళేబరం వద్ద రైతు

చేర్యాల(సిద్దిపేట): విద్యుత్ షాక్‌కు గురైన ఓ పాడిగేదె మృతి చెందిన ఘటన మండలంలోని చుంచనకోటలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఏషబోయిన సంజీవులకు చెందిన పాడిగేదె గ్రామ శివారులోని కెనాల్ పక్కన మేతమేసే క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌కు తాకి షాక్‌కు గురై మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. అతడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజిరెడ్డి


నియామక పత్రం అందుకుంటున్న రాజిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని వీరన్నపేటకు చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రాజిరెడ్డిని నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఇప్పటికే ఆయన హైదరాబాద్ జలమండలి, కాంగార్ యూనియన్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా రాజిరెడ్డిని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం పని చేస్తానన్నారు.

ఒత్తిడి తేవాలి: ఎస్ఎఫ్ఐ

సిద్దిపేటజోన్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసేలా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు క్యాంపు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. పదేళ్లుగా నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, అభిషేక్, నవదీప్ తదితరులు పాల్గొన్నారు.

దూరం.. భారం

చేరువకాని ప్రజాపాలన

- ఆర్టీఏ కార్యాలయం నిర్మాణానికి చర్యలు
- ఇప్పటికే ఐఓసీ భవనంతో బాధలు


ఆర్టీఏ కార్యాలయ నిర్మాణానికి ఎల్లమ్మ చెరువు మత్తడి సమీపంలో చదును చేసిన స్థలం

హుస్నాబాద్: ప్రజలకు దగ్గరగా పాలన ఉంటుందని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు దూరంగా ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తోంది. ఇప్పటికే ఐఓసీ భవనాన్ని పట్టణానికి దూరంగా నిర్మించారు. ప్రస్తుతం ఆర్టీఏ కార్యాలయాన్ని కూడా పట్టణానికి మూడు కి.మీ దూరంలో ఉన్న ఎల్లమ్మ చెరువు మత్తడి సమీపంలో నిర్మించేందుకు స్థలాన్ని చదును చేశారు. ఆర్టీఏ కార్యాలయానికి సొంత భవనం లేక పట్టణంలోని మినీ స్టేడియంలో కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వ పాలన నుంచి నేటి వరకు ఇక్కడే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

ఆ స్థలాన్నే కేటాయించాలి

ఎల్లమ్మ చెరువు వద్ద కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే దూరాభారం అవుతుందని, ప్రస్తుతం కొనసాగుతున్న ఆర్టీఏ కార్యాలయం సమీపంలో ఉన్న మూడెకరాల ప్రభుత్వ భూమిలోనే నిర్మించాలని కొందరు అధికారులు కోరుతున్నారు. అయితే దానిని స్థానిక ప్రజాప్రతినిధులు అడ్డుకుంటున్నట్లు సమాచారం. దీంతో అంత విలువైన భూమిని ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించకుండా ప్రైవేట్ కార్యాలయాలకు కేటాయిస్తారా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఐఓసీ.. అసౌకర్యం

మంత్రి పొన్నం ప్రభాకర్ తన శాఖకు సంబంధించిన ఆర్టీఏ కార్యాలయాన్ని అందరికీ వీలుగా ఉండే చోట నిర్మిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని, గత ప్రభుత్వం కూడా ఐఓసీ భవనాన్ని సుదూర ప్రాంతంలో నిర్మించి అసౌకర్యం కలిగించిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడికి వెళ్లాలంటే ఆటోలోనే వెళ్లాల్సి వస్తుందని, తీరా వెళ్లిన తర్వాత అధికారులు ఉంటారో ఉండరో తెలియడంలేదని వాపోతున్నారు. ఆర్టీఏ కార్యాలయాన్ని ప్రజలకు అనువుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మించాలని కోరుతున్నారు.

బఫర్ జోన్‌లోనే..

రాష్ట్ర మంత్రిగా పొన్నం ప్రభాకర్ ఇలాకాలో ఆర్టీఏ కార్యాలయానికి సొంత భవనం లేదు. దీంతో ఎల్లమ్మ చెరువు మత్తడి సమీపంలో దాదాపు రెండెకరాల భూమిని కేటాయించారు. కనీసం 3నుంచి 5ఎకరాల భూమి అవసరం అవుతుంది. అయితే ప్రస్తుతం ఎకరం స్థలాన్ని చదును చేశారు. అది ఎల్లమ్మ చెరువు బఫర్ జోన్‌లోకి వస్తుంది. అయితే మత్తడి పడితే ఆర్టీఏ కార్యాయం వరకు వరద వచ్చే అవకాశం ఉంది.


పక్కనే ఉన్న ఎల్లమ్మ చెరువు

దళారులకు విక్రయించి మోసపోవద్దు

బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రాగౌడ్



తొగుట(దుబ్బాక): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులకు విక్రయించి నష్టపోవద్దని బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రాగౌడ్ రైతులను కోరారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంఘ్ జిల్లా సమావేశంలో భారతీయ కిసాన్ సంఘ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని లింగాపూర్‌కు చెందిన చేపూరి చంద్రాగౌడ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. త్వరలో జిల్లాలో పర్యటించి రైతులతో సమావేశమై సమస్యలు తెలుసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఇటీవల విద్యుత్ ప్రమాదాలలో నలుగురు రైతులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటచేలలో వైర్లు కిందకు వేలాడటంతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదాల్లో మరణించిన రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటకు చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల శేఖర్‌బాబు సోదరుడు నరేశ్‌బాబు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆదివారం మృతి చెందాడు. దీంతో మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ఓదార్పు


కిషన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రతాప్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని లకుడారంలో గట్టు కిషన్ ఆదివారం పాము కాటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు కందూరి ఐలయ్య, నర్సింహాచారి తదితరులు పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దేవి రవీందర్, నాయకులు హైమద్, ఈగ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అక్కన్నపేట(హుస్నాబాద్): పేదవాడికి ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో కరీంనగర్ ఎంఎస్ఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో డాక్టర్ మానికరెడ్డి, ఎండీ సతీశ్‌రెడ్డి బృందం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు పరీక్షలుచేసి మందులను ఉచితంగా అందజేశారు. బీజేపీ నేతలు రాంగోపాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సమాజాన్ని నిర్మిద్దాం


సంఘీభావం తెలుపుతున్న స్వేరోస్ ప్రతినిధులు

బెజ్జంకి(సిద్దిపేట): ప్రతి ఒక్కరు జ్ఞాన సమాజాన్ని నిర్మించాలని యూఎస్ సాలేమాన్, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ నల్ల బాబు పిలుపునిచ్చారు. స్థానిక సత్యార్జున గార్డెన్స్‌లో ఆదివారం స్వేరోస్ జాతీయ మహాసభ నిర్వహించారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్షరం, ఆరోగ్యం, ఆర్థికంతోనే అట్టడుగు వర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమన్నారు. ఉద్యోగాలు, రాజకీయాలతో పాటు వ్యాపారరంగాల్లో రాణించాలనేది స్వేరోస్ సుప్రీం ప్రవీణ్‌కుమార్ ఆకాంక్ష అని చెప్పారు. దీనికి ముందుగా ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరుతూ 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో మహాసభ కన్వీనర్ సురేశ్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ప్రవీణ్, రాష్ట్ర చీఫ్ కన్వీనర్ దుర్గయ్య, వీరయ్య, ప్రకాశ్, తిరుపతి, జిలా అధ్యక్షుడు బాబు, ప్రభాకర్, కృష్ణ, ప్రవీణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శం' అంటే ఇదేనా!


పాఠశాలలో అధ్వానంగా టాయిలెట్స్

చిన్నకోడూరు(సిద్దిపేట): అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి వాటికి నిధులు విడుదల పనులు చేయించారు. అదే విధంగా మండల పరిధిలోని చౌడారం మధిర గ్రామం ఎల్లమ్మజాలు ప్రాథమిక పాఠశాలకు రూ.5లక్షలు మంజూరు చేశారు. అయితే ఫ్యాన్‌లు, స్విచ్ బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. టాయిలెట్స్ మాత్రం అధ్వానంగా మారాయి. నిధులు ఉన్నా టాయిలెట్స్ నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఒకే డీఏ ప్రకటించడం సరికాదు

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నేతలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఒకే డీఏ ప్రకటించడం సరికాదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలీఅహ్మద్, యాదగిరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదు వాయిదాల కరువు భత్యం(డీఏ) పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం ఒక్క డీఏను మాత్రమే విడుదల చేయడం విచారకరమని వాపోయారు. అధికారంలోకి వచ్చిన పదిహేను రోజుల్లోనే మూడు వాయిదాల డీఏలను విడుదల చేస్తామని కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పేర్కొందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకే డీఏను విడుదల చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొంత కాలంగా ఉద్యోగులకు కరువు భత్యాన్ని ప్రకటించడం లేదని వాపోయారు. ఉపాధ్యాయులకు మొండిచెయ్యి చూపడం సరికాదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మిగతా డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా సదర్ ఉత్సవాలు


సదర్ ఉత్సవాలలో పాల్గొన్న సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ఆవరణలో జరిగిన సదర్ ఉత్సవాలలో జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆదివారం తెలిపారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం హైద్రాబాద్‌లో సదర్ ఉత్సవాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సదర్ ఉత్సవాలలో జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గయాజొద్దీన్, నజ్జు, మహేందర్, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారన్నారు.


కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఆదమరిస్తే షాకే..

మిరుదొడ్డి(దుబ్బాక): పొలాలకు వెళ్లే రోడ్ల పక్కన ఎలాంటి కంచెలు లేకుండా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. మండల పరిధిలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని స్థితిలో రైతులు ఉన్నారు. వ్యవసాయ పొలాల్లో ఇలాంటి ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల చాలా చోట్ల పశువులు కూడా మృత్యువాత పడుతున్నాయని, మేతకు వెళ్లే సమయంలో ప్రమాదవశాత్తు వైర్లకు తగిలి విద్యుత్ షాక్‌తో మృతి చెందుతున్నాయని రైతులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అనుమతులు లేకపోతే చర్యలు తప్పవు

ఏసీపీ సతీశ్



హుస్నాబాద్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేసే వ్యాపారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని ఏసీపీ సతీశ్ సూచించారు. పోలీసు, మున్సిపల్, అగ్నిమాపక, విద్యుత్‌శాఖ నిర్దేశించిన ప్రదేశంలో అన్ని అనుమతులతో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. దుకాణ సమీపంలో ఇసుక, నీరు, రెండు అగ్నిమాపక పరికరాలు ఉంచాలని సూచించారు. అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణదారులు తప్పనిసరిగా తమ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోను దుకాణాలను జనావాసాల మధ్య ఏర్పాటు చేయవద్దని ఏసీపీ సూచించారు.

అనుమానాస్పద స్థితిలో ఆవు మృతి

కలుషిత జలాలే కారణమంటూ బాధితుడి ఆరోపణ



ములుగు(గజ్వేల్: మండలంలోని కొక్కొండలో ఒక పాడిఆవు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకోగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. పొలం సమీపంలో ఉన్న పరిశ్రమ నుంచి వెలువడుతున్న కలుషిత జలాలే ఆవు మృతికి కారణమని బాధిత రైతు గోద వెంకటేశ్ ఆరోపించాడు. తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ విజయ్‌కుమార్, బాధితుడు తెలిపిన ప్రకారం.. వెంకటేశ్‌కు నాలుగు ఆవులు, ఒక దూడ ఉన్నాయి. వాటిని తమ వ్యవసాయ భూమి వద్ద మేపుతుంటాడు. వ్యవసాయ భూమిలోకి సమీప పరిశ్రమలోని వ్యర్థ జలాలు వస్తుంటాయి. ఈ క్రమంలో శుక్రవారం ఆవు ఆ నీటిని తాగడం వల్ల మరణించిందని, పది రోజుల క్రితం దూడ కూడా చనిపోయిందని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పొలంలోకి వ్యర్థాలు రాకుండా చర్యలు తీసుకోవాలని రైతు అధికారులను కోరాడు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

రెండు అంబులెన్స్‌లు కేటాయించాలి

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్


మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తక్షణమే రెండు 108 అంబులెన్స్‌లు కేటాయించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు నేతలు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుమూల పల్లెలు, గిరిజన తండాలు అధికంగా ఉన్నాయని, ఆయా ప్రాంతాలకు నిరంతరం వైద్య సదుపాయం అందుబాటులో ఉండేందుకు 50 పడకల ఆసుపత్రిని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సేవలు అందించాలని కోరారు. మారుమూల గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు సరిగా అందక నానాఅవస్థ పడుతున్నారని, ఇప్పటికైనా జిల్లా వైద్య అధికారులు స్పందించి సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి


రక్తదాతలతో నిర్వాహకులు

చేర్యాల(సిద్దిపేట): సమాజ సంక్షేమం కోసం పోలీసు అమరులు చేసిన త్యాగాలు మరువలేనివని వివేకానంద టీచర్స్ అసోసియేషన్ మండల గౌరవాధ్యక్షుడు మీస వెంకటేశ్వర్లు అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా వివేకానంద టీచర్స్ అసోసియేషన్, చేర్యాల రక్తదాన్ సేవ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 50 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బాలభాస్కర్, నితీశ్, అమరేందర్‌రెడ్డి, సిద్దారెడ్డి, రక్తదాతలు శ్రీనివాస్, అరవింద్, పరమేశ్వర్, రజనీకాంత్, గణేశ్, కరుణా కర్, రాజేందర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.


1991-92 పూర్వ విద్యార్థులు


1995-96 బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వ'సమ్మేళనం

- చాలా యేళ్లకు కలిసిన పూర్వ విద్యార్థులు
- ఘనంగా గురువులకు సన్మానం

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి 1991-92బ్యాచ్ విద్యార్థులు స్థానిక శ్రీవేంకటేశ్వర గార్డెన్‌లో ఆదివారం సమేశనం నిర్వహించారు. అలాగే 1995-96కు చెందిన విద్యార్థులు స్థానిక లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించుకున్నారు. దాదాపు 32, 28 యేళ్ల తర్వాత కలుసుకొని సందడి చేశారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులు నారాయణరెడ్డి, సంజీవరెడ్డి, కనకయ్య, ప్రభాకర్‌రెడ్డిని శాలువాలతో సన్మానించారు.

ఐనాపూర్ పాఠశాలలో..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని ఐనాపూర్ ఉన్నత పాఠశాలలో 2001-02లో పదో తరగతి చదివిన విద్యార్థులు 22యేళ్ల తర్వాత పాఠశాలలో కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, నాగభూషణం, శ్రీరాములు, నర్సింహులు, నారాయణరెడ్డి, ఆనంద్, జనార్దన్, పూర్వ విద్యార్థులు సత్యనారాయణ, అశోక్, ప్రవీణ్, కవిత, సంతోషి, మంజుల, రేఖ, స్వాతి, సంపత్‌రెడ్డి, వెంకట్‌నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెప్పలేనంత సంతోషం..



32 యేళ్ల తర్వాత తిరిగి స్నేహితులను కలుసుకోవడం మాటల్లో చెప్పలేనంత సంతోషంగా ఉంది. ఇలాంటి సమ్మేళనాలు స్నేహ బంధాన్ని మరింత బలపరుస్తాయి. నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– జయప్రద, పూర్వ విద్యార్థి

మధురానుభూతి కలిగింది..



28 యేళ్ల తర్వాత పాత మిత్రులను కలుసుకోవడం మర్చిపోలేని విషయం. ఒకే చోట అందరినీ కలుసుకోవడం మరుపురాని మధురానుభూతిని కలిగించింది. గురువులను గౌరవించి ఆశీర్వాదం పొందే అవకాశం వచ్చింది.

– శాంతి కుమార్, పూర్వ విద్యార్థి


ఐనాపూర్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు